క్లుప్తంగా

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

– వాల్‌పోస్టర్లను విడుదల చేసిన జెడ్పీసీఈఓ

చిత్తూరు కార్పొరేషన్: నిత్యం పుస్తక పఠనంతో మేథో వికాసం కలుగుతుందని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల వాల్‌పోస్టర్లను విడుదల చేసి ఆయన మాట్లాడారు. గురువారం నుంచి 20 వరకు జరగనున్న వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 14న జాతీయ పతాకావిష్కరణ, విద్యార్థులతో ర్యాలీ, 15న పుస్తక ప్రదర్శన, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, 16న గ్రంథాలయ పితామహుల సంస్మరణ, 17న కవి సమ్మేళనం, 18న సాహితీ సదస్సు, 19న మహిళా దినోత్సవం, 20న ముగింపు సమావేశం నిర్వహిస్తామని వివరించారు. చివరిరోజు విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌వీఎస్ శర్మ, ఉపగ్రంథాలయాధికారి లలిత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బంగారుపాళెం: బంగారుపాళెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ వాణీశ్రీదేవి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రాజెక్టు పరిధిలోని యాదమరి మండలం రసూల్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్(మైనారిటీ) పోస్టు ఖాళీగా ఉందని, అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 22వ తేది సాయంత్రం లోపు అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని వీర్లగుడిపల్లె, కారకాంపల్లె అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐరాల సీడీపీఓ నిర్మల తెలిపారు. ఈ పోస్టులను ఓసీ కులాలకు రిజర్వు చేశామని, స్థానికులు ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఐరాల పాతపాళ్యంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

చిత్తూరు అర్బన్: గంజాయి విక్రయిస్తున్న కేసులో ఇద్దరు నిందితులను చిత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరు వన్‌టౌన్ సీఐ జయరామయ్య కథనం మేరకు.. మంగళవారం మధ్యాహ్నం చక్కర ఫ్యాక్టరీ రోడ్డు – కట్టమంచి కూడలి వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా తిరుగుతుంటే వాళ్ల వద్ద ఉన్న సంచులను తనిఖీ చేశారు. ఇందులో గంజాయి ఉండటంతో, నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. గంగాధర నెల్లూరుకు చెందిన సెల్వం (54), చిత్తూరులోని తేనబండకు చెందిన మురుగన్ (40) కలసి నగరంలో గంజాయి విక్రయిస్తున్నట్లు తేలింది. వారి నుంచి 2.7 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండుకు ఆదేశించారు. అనంతరం వీళ్లను చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు.

జ్యోతిప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భూమన, నారాయణస్వామి, విజయానందరెడ్డి



హాజరైన నాయకులు, కార్యకర్తలు



నూతనోత్తేజం

- చిత్తూరు వైఎస్సార్ సీపీలో ఫుల్ జోష్
- పార్టీ కార్యకర్తల్లో స్థైర్యం నింపిన కరుణ

కూటమి నేతలు దాడులు, కేసులకు విసిగిపోయిన వైఎస్సార్‌సీపీ క్యాడర్‌కు మంగళవారం చిత్తూరులో నిర్వహించిన నియోజకవర్గ పార్టీ సర్వసభ్య సమావేశం జోష్ నింపింది. తిరుపతి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా భూమన కరుణాకరరెడ్డి బాధ్యతలు స్వీకరించాక మొదటి సమావేశం చిత్తూరులో ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తలకు భరోసానిచ్చి మనోస్థైర్యం పెంచారు. భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు హాజరవడంతో పార్టీ శ్రేణులకు ఉత్సాహానిచ్చింది. తొలుత జ్యోతి ప్రజల్వన చేసి వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అధికారంలోకి వచ్చింది మొదలు ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపుతో వ్యవహరిస్తోందని కూటమి ప్రభుత్వం వేధింపులు, ప్రజా వ్యతిరేక పాలనపై నాయకులు నిప్పులు చెరిగారు. ప్రజాప్రతినిధులు సరళమేరి, కేపీశ్రీధర్, రాంగణేష్, కృష్ణారెడ్డి, అన్బు, ప్రతిమారెడ్డి, మనోజ్‌రెడ్డి, బాబీ, అప్పాజీ, నారాయణ తదితరులు పాల్గొన్నారు. – చిత్తూరు కార్పొరేషన్

పార్టీకి కార్యకర్తలే మూలస్తంభాలు



ఎన్ని ఇబ్బందులు వచ్చినా పార్టీకి మూలస్తంభాలుగా ఉన్న కార్యకర్తలే బలం. ఎవరూ మనోధైర్యం కోల్పోవద్దు. అందరూ ఐక్యంగా ఉండాలి. ఎవరికి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటాం. ఎవరికి కష్టం వచ్చినా అందరూ స్పందిస్తాం. అధికారంలోకి వచ్చి నెలలు దాటుతున్నా చంద్రబాబు హామీలను నెరవేర్చకుండా తమను మోసగించారని ప్రజలు మండిపడుతున్నారు. ఆ హామీల సాధనకు ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– విజయానందరెడ్డి, చిత్తూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి

నైతికంగా మనదే గెలుపు



చిత్తూరులో విజయానందరెడ్డి ఎన్నో ప్రజా సేవా కార్యక్రమాలు చేశారు. ఓడిపోతామని కలలో కూడా అనుకోలేదు. నైతికంగా మనమే గెలిచాం. వైఎస్సార్ కుటుంబంతో కరుణన్నకు ఎన్నో సంవత్సరాలుగా అనుబంధం ఉంది. పార్టీ పెట్టక ముందు నుంచి జగనన్న ఆయనకు తెలుసు. ఆయన నాయకత్వంలో ముందుకు వెళదాం.

– చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్, చిత్తూరు

భూమనే నడిపిస్తారు



భూమన మనందరికీ మార్గదర్శిగా ఉంటూ ముందుకు నడిపిస్తారు. ఏదో మతలబు చేశారు కనుకే మనం ఓడిపోయాం. ఇప్పటికీ ప్రజల్లో దీనిమీద చర్చ నడుస్తూనే ఉంది. దుష్టపాలనతో కూటమి ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకుంది. ప్రజలకు అండగా నిలబడతాం. కేసులకు భయపడి పార్టీలు మారే ఆలోచన పెట్టుకోవద్దు. అందరూ తిరగబడితే ఏమీ చేయలేరు.

– పురుషోత్తంరెడ్డి, చుడా మాజీ చైర్మన్

పూర్వవైభవం వస్తుంది



కరుణన్న రాకతో పార్టీకి పూర్వవైభవం వస్తుందనే నమ్మకం ఉంది. వామపక్ష భావాలు ఉన్న ఆయన పార్టీ అభివృద్ధికి కృషి చేస్తారు. ఎన్నో ఏళ్ల ఆయన రాజకీయ అనుభవం మనకు ఎంతో ఉపయోగం. కార్యకర్తలకు ఐక్యంగా ఉంటూ సమస్యల పోరాటాలు చేద్దాం.

– రాహుల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

సంకల్పంతో ముందుకు..



అబద్ధాలు చెప్పడం మా నాయకుడికి తెలియదు. కొన్ని ఓట్ల తేడాతో చిత్తూరులో అధికారం కోల్పోయాం. దానికి బాధ పడవద్దు. భగవంతుడు మరోసారి అధికారంలోకి వచ్చేలా ఆశీర్వదిస్తాడు. ప్రజలకు మళ్లీ ఎంతో మంచి చేయవచ్చనే సంకల్పంతోనే ముందుకు వెళ్తాం. ఎస్సీలకు వైఎస్సార్‌సీపీలో ప్రాధాన్యత ఇస్తున్నారు. సాయం చేయడమే జగనన్న, విజయానందరెడ్డికు తెలుసు.

– ప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు

మళ్లీ మంచిరోజులొస్తాయ్



కాంగ్రెస్ పార్టీలో ఎన్నో ఇబ్బందులు పెట్టి జగనన్న అక్రమంగా జైలుకు పంపారు. ఆయన ఎక్కడా ఎవరికీ బెదరకుండా ముందుకు నడిచి మనల్ని నడిపించారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని మనం ఐక్యంగా ఉందాం. అధికారం కోసం పార్టీలు మారవద్దు. మనకంటూ మళ్లీ మంచిరోజులు వస్తాయి.

– మధుసూదన్, సర్పంచ్

ఐక్యంగా ఉండాలి



మనకు అధికారం లేకపోయిన చిత్తూరులో పార్టీ బలంగా ఉంది. ఇలాగే ఐక్యంగా ఉంటే మన జోలికి ఎవరూరారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. ఇప్పటికే కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎప్పటికప్పుడు ఎండగడదాం. మరోసారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా చిత్తూరులో మరింత జోష్‌తో ముందుకు వెళదాం.

–హరిణిరెడ్డి, కార్పొరేటర్

క్యాడర్‌కు ధైర్యం



కూటమి నేతల దాడుల్లో గాయపడి ఇబ్బందులు పడుతున్న కార్యకర్తలకు ధైర్యం నింపడానికి కరుణన్న ఇక్కడికి వచ్చారు. రానున్న రోజుల్లో ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందనే నమ్మకం ఉంది. జమిలీ ఎన్నికలు వస్తే అందరూ కలిసి పార్టీని గెలిపించుకుందాం.

– జ్ఞానజగదీష్, నగర పార్టీ అధ్యక్షుడు, చిత్తూరు

చివరిశ్వాస వరకు పార్టీలోనే..



2011లో పార్టీలోకి వచ్చాను. అప్పట్లో కరుణాకర్‌రెడ్డి, నారాయణస్వామి, చెవిరెడ్డి గ్రామ గ్రామాన తిరిగి పార్టీని బలోపేతం చేశారు. కరుణన్న రాకతో ఉత్సాహం పెరిగింది. ఈ మధ్య కొన్ని కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొని కార్యక్రమాలకు దూరంగా ఉన్నాను. విజయానందరెడ్డి అన్న పిలుపుతో మళ్లీ వచ్చాను. చివరి శ్వాసవరకు పార్టీలోనే ఉంటూ కష్టపడతాను.

– గాయత్రీదేవి, జిల్లా మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు

30 ఏళ్లుగా టీడీపీలో ఉన్నా కూడా..



30 ఏళ్లుగా టీడీపీలో వివిధ హోదాలో సేవలు అందించా. కానీ మైనారిటీలకు అక్కడ ఎలాంటి గుర్తింపు లేదు. విజయానందరెడ్డిపై నమ్మకంతో ఇక్కడికి వచ్చాం. వైఎస్సార్‌సీపీలోనే మైనారిటీలకు ప్రాధాన్యత. మా అబ్బాయి బీటెక్ 4వ సంవత్సరం వరకు విద్యాదీవెనతో చదివాడు. కూటమి ప్రభుత్వ పాలనలో ఇప్పుడు ఏ పథకాలూ ప్రజలకు అందడం లేదు.

– నౌషద్, మైనారిటీ నాయకుడు

పాఠశాలల అభివృద్ధికి గ్రాంటు విడుదల

తవణంపల్లె: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం రూ.10.85 లక్షల గ్రాంటు విడుదల చేసిందని ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి తెలిపారు. ప్రస్తుతం మండలంలోని పాఠశాలకు 50 శాతం నిధులు రూ.5,42,500 విడుదలైనట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయులు ఈ నిధులను అభివృద్ధి పనులకు వినియోగించాలన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ కోరారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు సోమవారం డీఈఓ వరలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన డీఈఓతో మాట్లాడుతూ టీచర్ల సమగ్ర సీనియర్, రెగ్యులరైజేషన్ జాబితాలను డీఎస్సీల వారీగా, మార్కులు, మెరిట్ నెంబర్‌తో సహా ప్రకటించాలన్నారు. ఇటీవల సాధారణ ఎన్నికల సమయంలో వేసవి సెలవుల్లో శిక్షణ, డ్యూటీలు నిర్వహించిన టీచర్లకు సంపాదిత సెలవులు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మున్సిపల్, కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, ఎస్ మణిగండన్ మాట్లాడుతూ వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో జరిగిన తప్పిదాలను సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రెడ్డెప్పనాయుడు, రెహానాబేగం, దీనాతి, ఎస్పీ భాషా, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్లను పరిశీలించిన ఎస్ఈ



అనుప్పల్లె సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: క్షేత్రస్థాయిలో లైన్‌లాస్ లేకుండా నిర్వహించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన ఈఈ మునిచంద్రతో కలిసి రెడ్డిగుంట, అనుప్పల్లె, కొత్తపల్లె, గుడిపాల సబ్‌స్టేషన్లను పరిశీలించారు. సబ్‌స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుకుని వాటి నిర్వహణను లైన్ ఇన్‌స్పెక్టర్లు చూడాలన్నారు. అలాగే కరెంటు తీగలకు అడ్డంగా ఉన్న వాటిని తొలగించాలన్నారు. ఫీడర్ల వారీగా తరచూ ట్రీ కటింగ్ చేయాలన్నారు. ప్రతి నెలా 7వ తేదీలోపు విద్యుత్ రీడింగ్ పూర్తి చేయాలన్నారు. లైన్ ట్రిప్పింగ్స్‌ను బుక్‌లో నమోదు చేయాలన్నారు. వదులుగా ఉండే లైన్లను సరిచేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు మార్పు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి తనిఖీ

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలోని లింక్ ఏఆర్‌టి, క్షయ నిర్మూలన కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే రోగులకు సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అత్యవసర కేసులపై ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో సేవలు అందించాలన్నారు. ఎయిడ్స్, క్షయ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధులకు సకాలంలో హాజరు కాని సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఏఆర్‌టి కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు జిల్లా వైద్యాధికారి

యాజమాన్య పద్ధతులు పాటించండి

–జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

గుడిపాల: పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం క్రిష్ణజమ్మాపురంలో పొలం పొలుస్తోంది నిర్వహించారు. వరిసాగులో సాంకేతిక పద్ధతులు, విత్తనశుద్ధి నుంచి పంట కోతల వరకు పాటించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులలు, ఎరువుల వాడకం, సేంద్రియ వ్యవసాయం, ఈ–పంట నమోదు, పంటల బీమా, సూక్ష్మ పోషకాల గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ ఉమ, వ్యవసాయ అధికారి మాధవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మురళీకృష్ణ


భార్యపై కోపంతో అతివేగంగా వెళుతూ..



మృతి చెందిన మధు

తిరుపతి రూరల్: దంపతుల మధ్య మనస్పర్థలు..కోపతాపాలకు ఒకరి ప్రాణం పోయింది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. చిత్తూరు జిల్లా ఐరాల మండలం నెల్లిమందకు చెందిన సురా మధు (40) మేస్త్రీ పని చేస్తున్నాడు. అతని భార్య గాయత్రి తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తోంది. వీరికి ముగ్గురు పిల్లలు. వీరు జీవకోనలో నివాసం ఉంటున్నారు. భార్యభర్తల మధ్య నెల క్రితం మనస్పర్థలు వచ్చాయి. దీంతో మధు వాళ్ల సొంత ఊరు నెల్లిమందకు వెళ్లాడు. మంగళవారం తిరుపతికి వచ్చి ఆస్పత్రి వద్ద డ్యూటీ ముగించుకున్న తన భార్య గాయత్రిని కలిశాడు. గొడవన్నీ మరచి కలిసి జీవిద్దామని ప్రాధేయపడ్డాడు. ఆపై బైక్‌లో ఎక్కించుకుని స్వ గ్రామానికి బయలుదేరాడు. ప్రయాణంలో ఇద్దరి మధ్య మరోసారి వాగ్వాదం జరిగింది. దీంతో భార్య మీద కోపంతో బైక్‌ను వేగంగా నడుపుతూ చెర్లోపల్లె సమీపంలో తాటితోపు వద్ద రోడ్డుపై నిలిచి ఉన్న పాలవ్యాన్‌ను అదుపు తప్పి ఢీకొన్నాడు. ఈ ఘటనలో మధు అక్కడికి అక్కడే మృతి చెందాడు. బైక్ వెనుక ఉన్న గాయత్రికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం గాయత్రిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. రూరల్ సీఐ చిన్నగోవిందు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మధు మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించారు. మృతుడి సోదరి మంజుల ఫిర్యాదు మేరకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా రోడ్డుపై వాహనాన్ని పార్కు చేసిన పాలవ్యాన్ డ్రైవర్ బాలరంగడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిత



శిక్షణకు హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్‌సీసీతో క్యాడెట్లకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని 35 ఆంధ్రా బెటాలియన్ క్యాంప్ కమాండెంట్ కల్నల్ నోయల్ వివేక్ మోనిస్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు మైదానంలో వార్షిక శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిక్షణలో క్యాడెట్లు క్రమశిక్షణతో ఉండాలన్నారు. శిక్షణలో మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్‌లో నైపుణ్యం పొందాలన్నారు. క్యాడెట్‌లకు ఏ.బీ, సీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం పోక్సో కేసులు, బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ లోకనాథన్, ఎన్‌సీసీ ఆఫీసర్లు ప్రసాద్‌రెడ్డి, బాలాజి, ఈశ్వరరావు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల సమస్యపై వినతి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో ఇబ్బందులు లేకుండా చూడాలని ఈడిగ గౌడ్‌సంఘ నాయకులు కోరారు. చిత్తూరులోని తహసీల్దార్ కళావతిని మంగళవారం ఆ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

నకిలీ పట్టా సృష్టించి భూమి హాంఫట్!

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కొందరు నకిలీ పత్రాలు సృష్టించి తమ పూర్వీకుల భూమికి 2021లో అక్రమంగా రెవెన్యూ రికార్డులు సష్టించారని వి.కోట మండలం గంధరమాకులపల్లెకి చెందిన నారాయణప్ప, రామప్ప ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తరతరాలుగా వారసత్వంగా సంక్రమించిన 4.90 సెంట్ల భూమికి పట్టాదారు పాసు పుస్తకాలు కూడా ఉన్నాయని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈసీ సైతం తమ పేరిట ఉందన్నారు. 2021లో రికార్డులు తారుమారు చేసి సంబంధం లేని వ్యక్తుల పేర్లను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసారని, ఇది తమ దృష్టికి రావడంతో వెంటనే తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చామన్నారు. కానీ ఆన్‌లైన్‌లో మాత్రం ఇతర వ్యక్తుల పేర్లే ఉన్నాయని, జిల్లా కలెక్టర్ స్పందించి తమ భూమిని సర్వే చేయించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో భూ హక్కుదారులు వెంకటస్వామి, వీరప్ప, ఈశ్వర పాల్గొన్నారు.

లారీని ఢీకొని స్కూటరిస్టు మృతి

చిత్తూరు అర్బన్: లారీని ఢీకొట్టి యువకుడి మృతి చెందిన సంఘటన మంగళవారం నగరంలో చోటుచేసుకుంది. తాలూక ఎస్ఐ రమేష్ కథనం మేరకు.. తమిళనాడులోని తిరువణ్ణామలై పోలూరు చెందిన సుభాష్ (24) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తన ద్విచక్రవాహనంపై చిత్తూరు శివారుల్లోని చెర్లోపల్లె జాతీయ రహదారిపై వెళుతూ.. ముందు వెళుతున్న లారీను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సుభాష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, తాలూక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వసతి గది నిర్మాణ పనుల పరిశీలన

కాణిపాకం: కాణిపాకంలోని వినాయక సదన్ వసతి గదుల నిర్మాణ పనులను మంగళవారం ఈవో గురుప్రసాద్ పరిశీలించారు. పనులు శరవేగంగా పూర్తిచేసి భక్తులకు గదులు అందుబాటులోకి తీసుకురావాలని ఈఈ వెంకటనారాయణను ఆదేశించారు. వంద అడుగుల రోడ్డులో నూతన ఆర్చి నిర్మాణ పనులు, గోశాల గోవులను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, పవన్, బాలాజి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యత



అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ

పూతలపట్టు: పారిశుధ్యం పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ జుబేదా ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించినంతరం అధికారులతో మాట్లాడారు. గ్రామీణుల నుంచి పారిశుధ్యం సమస్యలపై ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ అధికారులు గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలాగే పంచాయతీలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ సుభాషిణి, జూనియర్ అసిస్టెంట్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ఐరాల: ఈ నెల 14 నుంచి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై వైద్య సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆయన ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలతో ఎన్‌సీడీ 3.0 కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, క్యాన్సర్‌పై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడానికి వైద్య సిబ్బంది సన్నద్ధం కావాలన్నారు. 18 సంవత్సరాలు దాటిన పౌరులకు ఇళ్ల వద్దనే ఉచితంగా క్యాన్సర్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ముందస్తు పరీక్షలతోనే క్యాన్సర్‌పై విజయం సాధ్యమని, వ్యాధి బారిన పడకముందే జాగ్రత్తలు పాటించాలని అనే నినాదంతో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్'

ఐరాల: వర్షాకాలంలో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిశుభ్రతే మందు అని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పాలకల–2, పత్తిపాటివారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మైనగుండ్లపల్లెలో...

తవణంపల్లె: మండలంలోని మైనగుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భవతులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తవణంపల్లె: మైనగుండ్లపల్లెలో..

పాపసముద్రంలో..

గుడిపాల: మండలంలోని పాపసముద్రంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి సంధ్య రోగులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకుని సలహాలు–సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది విజయ, చంద్రశేఖర్, గిరిజ, కవిత, బుజ్జమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.